
కథ

## ఆకునూరి మురళీకృష్ణ

# గాలివాన

''మానవ సంబంధాలన్నీ పూర్తిగా ఆర్థిక సంబంధాలే అన్న మీ భావాలతో నేను ఏకీభవించ లేను. మీ రచనలెంత బావున్నా అలాంటి భావాలు మాత్రం సమాజంమీద చాలా చెడు ప్రభావాన్ని చూపుతాయి'' అన్నాను నేను చైతన్యతో.

వర్షం కురుస్తున్న ఆ అర్ధరాత్రి పూట ఒక అపరిచిత వ్యక్తి తన ఇంటికి వచ్చి తీరికగా కూర్చుని తన రచనలని విమర్శిస్తూ మానవ సంబంధాల గురించి తనతో వాదించడం వింతగా అనిపించవచ్చు చైతన్యకి.



నాకు కావాల్సింది అదే. అతని నవలలో థ్రిల్ కోసం రాసే లాంటి సన్నివేశాలనే నేను నా పని పూర్తిచేయడానికి ఉపయోగించుకోవాలనుకున్నాను. తన ఎదురుగా కూర్చున్న నేను సామాన్యుడిని కాదని చైతన్యకి తెలుసు!

నన్ను అంచనా వేస్తున్నట్లు చూస్తూ కాసేపలాగే వుండిపోయాడు చైతన్య.

అప్పుడు మేమిద్దరం చైతన్య ఇంటి డాబామీద కుర్చీల్లో కూర్చున్నాము. బయట చీకటి చిక్కగా వుంది. వర్షం అప్పుడే వెలిసింది. చంద్రుడు కళావిహీనంగా వున్నాడు. చెట్లమీద నుంచి గాలికి అప్పుడప్పుడూ ఒకటి రెండు చినుకులు రాలి మా మీద పడుతున్నాయి. ఆ డాబా ఇల్లు ఊరికి దూరంగా విసిరేసినట్లుండి కనీసం స్ట్రీట్ లైట్లు కూడా లేకపోవడంతో దూరంగా హైవే మీద అడపాదడపా వెళ్తున్న వెహికిల్స్ తాలూకు హెడ్‌లైట్స్ వెలుగు తప్ప పెద్దగా వెలుతురు లేదు. చల్లటి గాలి చలి పుట్టిస్తూ ఆ వాతావరణంలో మరింత దిగులుని నింపుతోంది.

బంగాళాఖాతంలో అల్పపీడనం ప్రభావం వల్ల నాలుగు రోజులనుంచీ వర్షం ఆగకుండా కురుస్తూనే వుంది. పగలు కూడా ఆకాశం నల్లటి మబ్బులతో నిండిపోయి రాత్రిని తలపిస్తోంది. అలాంటి రోజుల్లో అర్ధరాత్రి సమయంలో ఒంటరిగా వుండే తన ఇంటి తలుపు ఎవరైనా తడతారన్న విషయాన్ని చైతన్య ఊహించి వుండడు.

తలుపు తీసిన అతడు ఎదురుగా కనిపించిన నన్ను మొదట గుర్తుపట్టలేదు.

''వర్షానికి నా కారు చెడిపోయింది. సెక్రటరీకి ఫోన్ చేసాను. మరో కారు వస్తోంది. అంతదాకా మీ ఇంట్లో వుండవచ్చా?'' అన్నాను. సూటులో వున్న నన్ను పరిశీలనగా చూసాడు చైతన్య. వర్షం చినుకులకి తడిసిన నా జుట్టు అందంగా నుదుటిమీద పడుతోంది. నా మాటల్లో సంస్కారం తొంగిచూస్తోంది.

''లోపలకు రండి'' అన్నాడు.

''థాంక్యూ'' అంటూ లోపలికి వచ్చి చొరవగా హాల్లో వున్న చెక్క సోఫా మీద కూర్చొని కర్చీఫ్‌తో నుదుటిన వున్న తడిని తుడుచుకుంటుంటే, అప్పుడు గుర్తుపట్టాడు చైతన్య నన్ను.

''మీరు ఇండస్ట్రియలిస్ట్ రవీంద్ర కదూ?'' అన్నాడు.

నిజానికి అతడు నన్ను గుర్తుపట్టడంలో ఆశ్చర్యమేమీ లేదు. గుర్తుపట్టకపోతేనే ఆశ్చర్యపోవాలి. సాఫ్ట్‌వేర్ రంగంలో నాదైన ముద్రవేసిన తెలుగువాడిగా ఆంధ్రప్రదేశ్‌లో అక్షర జ్ఞానమున్న ప్రతి ఒక్కరికీ నేను పరిచితుడినే. అలాంటి నేను రిస్కు తీసుకుని ఈ పనికి స్వయంగా రావడానికి కారణం చైతన్య నిజంగా

నా అభిమాన రచయిత కావడమే. అతనితో కనీసం ఒక్కసారైనా మాట్లాడాలన్న కోరిక నాలో అంతర్గతంగా చాలా బలంగా వుండడమే. తరువాత వచ్చే పరిణామాల నుంచి తప్పించుకోవడం నాకు పెద్ద సమస్య కాదు!

గదిలో చిందరవందరగా పడేసి వున్న పుస్తకాలనీ, ఒక మూల దుమ్ము పేరుకుపోయి వున్న కంప్యూటర్, రైటింగ్ టేబిల్, దానిమీద అస్తవ్యస్తంగా పడేసి వున్న కాగితాలనీ, అతడినీ మార్చి మార్చి చూస్తూ ''మీరు రచయిత చైతన్య కదూ?'' అన్నాను అప్పుడే గుర్తుపట్టినట్లుగా.

''అవును'' అన్నాడు చైతన్య. అతడు నన్ను గుర్తుపట్టినప్పుడు నా ముఖంలో కనిపించిన సంతోషం అతడిని నేను గుర్తుపట్టినప్పుడు అతనిలో కనిపించకపోవడాన్ని గమనించాను నేను.

''మీ పుస్తకాలు చాలా చదివాను నేను. మీ భావ వ్యక్తీకరణ అమోఘంగా వుంటుంది. మీ పుస్తకాలు నన్నెంతో ప్రభావితం చేసాయి. నేను ఎప్పట్నుంచో మిమ్మల్ని కలుసుకోవాలనుకుంటున్నాను. నా కారు సరిగ్గా మీ ఇంటి దగ్గరే ఆగిపోవడం నా అదృష్టం'' అన్నాను నేను.

ఈసారి వచ్చిన నవ్వుని చైతన్య దాచుకోలేకపోయాడు.

''జనం నా పుస్తకాలు మళ్ళీ మళ్ళీ చదివి నేను చెప్పే విషయాలని తెలుసుకోవాలనుకుంటారు కానీ నన్నెవరూ కలుసుకోవాలనుకోరు'' అన్నాడు నవ్వుతూ.

''నేను మాత్రం ఎప్పట్నుంచో మిమ్మల్ని కలవాలనుకుని మీ చిరునామా కోసం కూడా ప్రయత్నించాను. ఇంట్లో మీరొక్కరే వున్నారా?'' అన్నాను ఉత్సాహంగా.

''ఇంట్లో వుండేది నేనొక్కడినే. నాకెవరూ లేరు'' అన్నాడు.

''మీ పుస్తకాలెన్నో చదివాను నేను. ఒక రకంగా చెప్పాలంటే నేను మీ ఫ్యాన్ని''

చైతన్య నవ్వాడు. ''నేను రాసేది జనం విరగబడి చదువుతారు. కానీ బాహాటంగా నా అభిప్రాయాలని గౌరవించాలంటే వాళ్ళకి భయం. అందుకే నాకు పబ్లిషర్లు తప్ప ప్రత్యేకంగా అభిమానులుండరు''

''మీరు మెటీరియలిస్టులా?'' నేను మాట్లాడిన దానికి అతను స్పందించే విధానానికి అనుమానంగా చూస్తూ ఆసక్తిగా అడిగాను.

చైతన్య నేను అడిగినదానికి సమాధానం చెప్పకుండా ''మీ కారు రావడానికి ఎంత సమయం పడుతుంది?'' అన్నాడు.

''దాదాపు గంటా, రెండు గంటలు. మీకు అభ్యంతరం లేదు కదా?''

''అదేం లేదు. ఈ సమయంలో నేను కాసేపు డాబామీద గడుపుతాను. మీకు అభ్యంతరం లేకపోతే మీరు రావచ్చు. లేదా ఇక్కడే విశ్రాంతి తీసుకోవచ్చు'' అన్నాడతను.

నేను మౌనంగా అతన్ని అనుసరిస్తూ డాబా మీదకి చేరాను.

అక్కడున్న రెండు ప్లాస్టిక్ కుర్చీలనీ తువ్వాలుతో తుడిచి ''కూర్చోండి'' అన్నాడు.

తన కూడా తెచ్చిన సరంజామాని అక్కడున్న టీపాయ్ మీద సర్దాడు.

''మీరు రాసిన విషయాలని ఆచరణలో పెట్టి నేను వ్యాపారంలో ఎన్నో విజయాలని సాధించాను. ఒక రకంగా చెప్పాలంటే మీ రచనలు నన్నెంతో ప్రభావితం చేసాయి. నేనివాళ ఈ స్థాయిలో వున్నానంటే ఆ ఎదుగుదలలో మీ రచనల పాత్ర కూడా వుందని ఖచ్చితంగా చెప్పగలను'' అన్నాను సిన్సియర్‌గా. నా అభిమాన రచయితని కళ్ళారా చూస్తూ మాట్లాడుతున్నానన్న ఆనందం నన్ను నిలవనీయడం లేదు. వచ్చిన పని మర్చిపోయి నాతో ఏదేదో మాట్లాడిస్తోంది.

నా మాటలని పట్టించుకోనట్లుగా చీకట్లోకి చూస్తూ వుండిపోయాడు చైతన్య.

## నా గ్లామరే వేరు!

**నమిత తమిళ ఇండస్ట్రీలో టాప్ పొజిషన్‌లో కొనసాగుతోందిప్పుడు. తను చేసే ఎక్స్‌పోజింగ్‌ని చాలా మంది వల్గారిటీగా అభివర్ణించడంపై మండిపడుతోంది నమిత. నిజంగా తనది వల్గారిటీయే అయితే ఇంతగా డిమాండ్ తనకెందుకొస్తుంది? అని ఎదురు ప్రశ్నిస్తోంది. తనది భారీ పర్సనాలిటీ కాదని, బొద్దుగా వుంటానని, తనకి ఎలాంటి డ్రెస్సయినా సూటవుతుందని ఢంకా భజాయించి మరీ చెబుతోంది. 'చక్కనమ్మ చిక్కినా అందమే' లాగా 'చక్కనమ్మ ఏం చెప్పినా కరెక్టే అనాలి' మరి. దీన్నే అంటారు టైమ్ బాబూ టైమ్ అని.**



''కాకపోతే మానవ సంబంధాలలోని డొల్లతనాన్ని ఎత్తిచూపుతూ రాసే మీ రచనల్లోని భావాలన్నీ సామాన్యులకి మింగుడు పడనట్లుగా వుంటాయి? మీకింత అద్భుతమైన భాష, శైలే లేకుంటే మీ రచనలని జనం ఎప్పుడో తిప్పికొట్టి వుండేవారు'' అన్నాను నేను.

''భావవ్యక్తీకరణ కోసమే భాష. జనం నా రచనల్ని భాషకోసం, శైలికోసమే చదువుతున్నారంటే నేను ఒప్పుకోను. ఇదే భాషతో, ఇదే శైలితో అంతకుముందెంతో భావ కవిత్వం రాసాను. మరి వాటినెందుకు జనం చదవలేదు? అవన్నీ నాకెంతో నష్టాలని తీసుకుని వచ్చాయి''

''కానీ రాను రాను మానవ సంబంధాలని మీ రచనల్లో ప్రతిబింబించే తీరు విపరీతంగా కనిపిస్తోంది. భార్యా భర్త, అధికారీ ఉద్యోగి, చివరికి తల్లీకొడుకుల మధ్య బంధం కూడా అవసరం ప్రాతిపదికగా ఏర్పడినవే

అంటారు. అఫ్‌కోర్స్, వాటినెలా సమర్థవంతంగా ఉపయోగించుకోవాలో మీరు రాసిన విధానాలని ఆచరణలో పెట్టి నాలాంటి ఎందరో బిజినెస్ మేన్లు విజయాలు సాధించారు. కానీ నాకెందుకో మీ అభిప్రాయాలు సరైనవి కాదనిపిస్తోంది. అందులో కొంత నిజం వుంటే వుండొచ్చు కానీ అవి సమాజం మీద స్లో పాయిజన్‌లా పనిచేస్తాయనిపిస్తుంది నాకు. అలాంటి ఆలోచనా విధానం ప్రమాదకరం. కాదంటారా?'' అన్నాను. అనవసర ప్రసంగాలు వద్దని నాలోని బిజినెస్‌మేన్ ఒక పక్క నన్ను హెచ్చరిస్తున్నా అతడితో మరికొంతసేపు మాట్లాడాలన్న కోరికని నేను జయించలేకపోయాను.

చైతన్య నవ్వేడు. ''రచయిత పాఠకుడికి తనకి తెలిసిన ఏదో ఒక కొత్త విషయాన్ని చెప్పాలి. నాకు తెలిసినంతవరకూ మానవ సంబంధాలన్నింటికీ మూలం ఆర్థికపరమైన లేదా ఇతర అవసరాలే..మనం గొప్పగా అనుకునే ఈ అనుబంధాలు, ఆప్యాయతలూ ఏవీ నిజం కాదు. ఈ కుటుంబ బంధాలన్నీ డబ్బున్నప్పుడొకలాగ, డబ్బు లేనప్పుడొకలాగా వుంటాయి. అందుకే నాకు వాటిమీద నమ్మకం లేదు. ఆ విషయాన్ని స్పష్టంగా తెలుసుకుంటే భ్రమలు తొలగిపోయి ఆత్మవంచన లేకుండా మనిషి జీవించగలడని నా అభిప్రాయం. అదే నేను రాస్తూ వుంటాను''

''నేను మీ మాటలతో ఏకీభవించలేకపోతున్నాను'' అన్నాను.

''మీరు కూడా అందరిలాగే ఆత్మవంచన చేసుకుంటున్నారు. నా భావాలతో ఏకీభవించకపోతే నా రచనలు మిమ్మల్ని ప్రభావితం చేసాయని ఎందుకు చెప్పారు?''

నేను ఖంగుతిన్నట్లుగా చూసానతని వంక.

''మీకు మనుషుల మీద నమ్మకం లేదా?'' అడిగాను అతని వంక సూటిగా చూస్తూ. అతను రాయడంలోనే కాదు. మాట్లాడడంలో కూడా దిట్టే అని తెలుస్తోంది.

విస్కీలో సోడా కలిపి రెండో గ్లాసు సిద్ధం చేయబోతూ అడిగాడు అతడు ''మీరు తీసుకుంటారా?''

''వద్దు'' అన్నాను.

''అలవాటు లేదా?''

''వుంది, కానీ ఇప్పుడు వద్దు''

చైతన్య నవ్వాడు. ''అపరిచితులతో, తెలియని ప్రదేశంలో తాగడం ప్రమాదకరమనా? ఇలాంటి క్యాలిక్యులేషన్స్ నా నవలలో నేను చాలా రాసాను''

నేను సమాధానం చెప్పలేదు. అతడి మాటల్లోని సెటైర్ అర్థమయింది.

''పెద్ద బిజినెస్ మాగ్నెట్ కదా? మీరు చెప్పండి? మీకు వుందా మనుషుల మీద నమ్మకం?'' విస్కీ సిప్ చేస్తూ అడిగాడు చైతన్య.

అతడి ప్రశ్నకి ఒక్క క్షణం ఉలిక్కిపడ్డాను. ఆ ప్రశ్నని నేను ఊహించలేదు. నాకు నిజంగా మనుషుల మీద నమ్మకం వుందా? నా తడబాటు చూసి నవ్వుతూ అన్నాడు చైతన్య.

''మీరు డబ్బులో పుట్టి డబ్బులో పెరిగారు కనుక మీకు తెలియకపోవచ్చు కానీ మధ్యతరగతి జీవితంలో మానవ సంబంధాలని డబ్బు చాలా దారుణంగా శాసిస్తుంది. మనుషుల మీద, జీవితం మీద నమ్మకం పోయేటంతగా..'' చంద్రుడ్ని మబ్బులు కమ్మేసినట్లు అతని ముఖంలోని నవ్వుని ఏవో వైరాగ్యపు నీడలు కమ్మేసాయి.

తాగుతున్న విస్కీ ప్రభావంవల్లో ఏమో అతడు ఏదో లోకాల్లోకి వెళ్ళిపోయినవాడిలా మెల్లగా చెప్పసాగాడు. ''చాలామంది రచయితల్లా నాకు జీవితం వేరు, రచనలు వేరు కాదు. నా రచనలు నా జీవితానుభవానికి ప్రతీకలు. మీరనుకుంటున్నట్లు నేను మెటీరియలిస్ట్‌ని కాదు. అయితే బాగానే వుండేది. నేను గొప్ప మానవతావాదిని. వైరాగ్యం మెటీరియలిస్ట్‌లకన్నా భావుకులకే తొందరగా వస్తుంది''

అతడి మాటలు కొద్ది కొద్దిగా అర్థమౌతున్నట్లుగా అనిపిస్తోంది నాకు.

''జీవితంలో మీకేదో అనుకోని దెబ్బ తగిలి వుంటుంది. అందుకే అలా మాట్లాడుతున్నారు'' అన్నాను.

''అది ఎదురుదెబ్బ కాదు. పెద్ద మలుపు. అంతే. నాకు జీవితం అంటే ఏమిటో తెలియచెప్పిన మలుపు. నా అన్వేషణకి మొదటి అడుగు''


మా సంభాషణ ఎటు దారితీస్తోందో తెలియడం లేదు. మామూలు సందర్భాల్లో అయితే చేయదలుచుకున్న పనికి అడ్డుపడే అలాంటి సంభాషణలని వెంటనే త్రుంచేస్తాను. కానీ మాట్లాడుతున్నది నా అభిమాన రచయిత చైతన్యతో కావడంవల్ల నేను ఆసక్తిని చంపుకోలేకపోయాను.

''మీకభ్యంతరం లేకపోతే వివరంగా తెలుసుకోవచ్చా?'' అన్నాను.

చైతన్య కుర్చీలో వెనక్కి వాలి కళ్ళు మూసుకున్నాడు. ''శ్రావణి..మీలాగే ఒక అర్థరాత్రి పూట నా జీవితంలోకి అడుగు పెట్టింది. నా రచనలు చదివి నామీద

## సంగీత ఆశలు

గతంలో సంగీతకి 'శివపుత్రుడు' చిత్రం బోల్డు పేరు తెచ్చిపెట్టింది. ఇప్పుడు 'ధనం' అనే తమిళ చిత్రం కూడా తనకి అవార్డులు, ప్రశంసలు తీసుకొస్తుందని ఆశపడుతోంది సంగీత. ఈ సినిమాలో సెక్స్ వర్కర్‌గా నటిస్తున్న సంగీత నటనకు ఎంతో ప్రాముఖ్యం వున్న పాత్రట అది. తెలుగులోకి కూడా అనువాదం అయ్యే ఈ సినిమాపై సంగీత పెంచుకుంటున్న ఆశలు తీరతాయో లేదో!



అభిమానంతో నాకు తరచూ ఉత్తరాలు రాసే ఆమె ఒక అర్ధరాత్రి పూట ఇంట్లోవాళ్ళు చేస్తున్న పెళ్ళిని చెడగొట్టుకుని నా దగ్గరికి వచ్చేసింది. అప్పట్లో భావకవిత్వమే ఎక్కువగా రాసేవాడిని. దానిని అమ్మాయిలు, ఎక్కువగా అభిమానించే వాళ్ళు. అలా వచ్చిన శ్రావణి కురిపించిన అభిమానంలో నేను నిండా తలమునకలైపోయాను. ఆమె నన్ను విపరీతంగా ప్రభావితం చేసింది. అప్పటికింకా నాలో ఇంత మెచ్యూరిటీ లేదు. కనుక ఆమె నా మీద అభిమానంతోనే వచ్చిందనుకున్నాను కానీ ఇష్టంలేని పెళ్ళి తప్పించుకోవడమనే 'అవసరంతో' నా దగ్గరకి వచ్చిందని తర్వాత అర్థమైంది.''

''మెచ్యూరిటీ అన్నది ఒక స్థాయి కాదు చైతన్యా.. అది ఒక ప్రోసెస్! చెప్పండి. తర్వాత ఏం జరిగింది?'' అన్నాను నేను.

''ఆ తర్వాత నామీద యుద్ధానికి వచ్చిన ఆమె తరపు వాళ్ళందరినీ ఎంతో కష్టపడి ఎదిరించాను. ఆ అమ్మాయిని లేపుకొచ్చానని అన్నారంతా. ఆ అపవాదుని కూడా సంతోషంగా భరించాను. ఆమెని చూస్తే ఆమెతో కలిసి వుండాలన్న కోరిక నాకు కూడా కలిగింది. ఆమెకి కూడా నామీద ఆరాధన వుండడంతో కలిసే వున్నాం. కొన్నాళ్ళు జీవితం అప్పట్లో నేను రాసే కవిత్వంలాగే హాయిగా గడిచింది. ఆమె నాకు ఎంతో ఇన్స్పిరేషన్ ఇచ్చేది.

ఆ తర్వాత ప్రారంభమైంది అసలు సమస్య. ప్రేమ, ఆరాధన ఇవేమీ డబ్బు ఇచ్చే సుఖాన్నివ్వలేవని ఆమె తెలుసుకున్నట్లుంది. నా ఆర్థికస్థాయి ఆమెకి సంతృప్తికరంగా లేదన్న విషయం క్రమంగా అర్థమవసాగింది నాకు. ఆమె నన్ను మరిన్ని కమర్షియల్ రచనలు చేయమని ప్రోత్సహించేది. ఆమె ప్రోత్సాహంతో నేను కూడా ఉద్యోగం మానేసి సినిమా పాటలు రాద్దామని ప్రయత్నించాను అప్పట్లో. కానీ అటు అవకాశాలు రాక, ఇటు ఉద్యోగమూ లేక మరింత దరిద్రంలో కూరుకుపోయాము. ఆ దరిద్రం మా ఇద్దరికీ ఒకరి నిజస్వరూపాలని మరొకరికి చూపించింది. మేము ఎంతో గాఢమైనదనుకున్న మా అనుబంధం ఎంత పలుచనిదో నాకు తెలిసి వచ్చింది. ఆ తర్వాత మరొక అర్ధరాత్రి సమయంలో ఆమె నన్ను వదిలి వెళ్ళిపోయింది.

గాఢమైన నిశ్శబ్దం అక్కడ అలుముకుంది. చలిగాలికో మరెందుకో తెలియదు కానీ చిన్నగా ఒణికాను నేను.

''మీరన్నట్లుగా మెచ్యూరిటీ ఒక దశ కాదు. ఒక ప్రోసెస్. అప్పటి నుంచే నాలో మెచ్యూరిటీ అన్న ప్రోసెస్ మొదలైంది. ఆమె మీద వున్న కసితో నేను నా మొదటి నవల రాసాను. మనిషి మనస్తత్వాన్ని నగ్నంగా నిలబెట్టినట్టు చిత్రించి మరీ రాసాను ఏ హిపోక్రసీలూ లేకుండా. చిత్రంగా అది చాలామందికి నచ్చింది. విపరీతంగా క్లిక్ అయ్యింది. ఆ తరువాత నేను వెనక్కి తిరిగి చూసుకోవాల్సిన అవసరం కలుగలేదు. ఇప్పుడు చెప్పండి. ఇలాంటి అనుభవం తర్వాత కూడా నన్ను మానవ సంబంధాలు ఆర్థికపరమైన అవసరాల కారణంగా కాక అనుభూతి ప్రాతిపదికగా ఏర్పడతాయంటూ రాయమంటారా?'' సూటిగా నా కళ్ళలోకి చూస్తూ అడిగాడు చైతన్య.

''మీరు ఆమెని సరిగ్గా అర్థం చేసుకోలేదేమోననిపిస్తోంది. మానవసంబంధాలన్నీ ఆర్థికపరమైనవే అన్న మీ మాటలని నేను పూర్తిగా వ్యతిరేకించను. కానీ ఆర్థిక సంబంధాలు మానవ సంబంధాలలో ఒక భాగమని గుర్తించగలిగితే మానవ సంబంధాలు మరింత బలపడతాయని నా నమ్మకం!'' అన్నాను నేను.

వచ్చిన పని మరిచిపోయి అలాంటి ప్రవచనాలు వల్లిస్తున్నందుకు నాలోని బిజినెస్‌మేన్ నన్ను హెచ్చ

## అశిన్‌కి ఆమీర్ కితాబు



**కేరళ కుట్టి అశిన్ 'గజినీ' హిందీ వెర్షన్‌తో బాలీవుడ్‌కి పరిచయమవుతోందనే సంగతి అందరికీ తెలుసు కదా! ఈ చిత్రం తర్వాత అశిన్ హిందీలో బిజీ స్టార్ అయిపోతుంది అని ఇటీవల ఆ చిత్రం హీరో ఆమీర్ ఖాన్ చెప్పాడు. నిజంగా అశిన్ నటన చాలా బావుంది. దానికి తోడు ఆమె హిందీ భాష పలికే విధానం కూడా అచ్చం హిందీ అమ్మాయి లానే వుంది. కాబట్టి బాలీవుడ్‌ని ఆమె ఆకట్టుకుంటుందనే విశ్వాసం తనకుందని అంటున్నాడు ఆమీర్. ఆమీర్ తననిలా ప్రశంసించినందుకు అశిన్ తెగ సంబరపడుతోంది. కాదా మరి!**

రిస్తూనే వున్నాడు. అయినా ఏదో శక్తి ఆవహించినట్లు నేను మాట్లాడకుండా వుండలేకపోతున్నాను. నా మాటలు విన్న చైతన్య నన్ను ఒక అద్భుతాన్ని చూసినట్లు చూసాడు. నేను కొనసాగించాను.

''నా నమ్మకం కూడా అనుభవంలోంచి వచ్చిందే. విచిత్రంగా ఇలాంటి అర్ధరాత్రి సమయంలోనే నేను నడిరోడ్డు మీద వర్షంలో ఆకలితో వున్న ఒక అమ్మాయిని కలుసుకోవలసి వచ్చింది. బిజినెస్ పరంగా నేను అప్పుడు చాలా పెద్ద సమస్యలో వున్నాను. మనశ్శాంతికోసం కారాపుకుని రోడ్డు మీద నడుస్తున్న నన్ను ఆమె అందం ఆకర్షించింది. కాసేపు నా సమస్యని మర్చిపోయి రిలాక్సవడం కోసం ఆమెని ఆదుకున్నాను. దానికి ప్రతిఫలంగా నేను కోరుకున్నది ఆమెని. మీరన్న మెటీరియలిస్టిక్ సిద్ధాంతాల్ని పూర్తిగా నమ్మే వ్యక్తిని నేను ఆ రోజు. ఆమె చాలా సులువుగా నేనడిగిన దానికి ఒప్పుకుంటుందనుకున్నాను. కానీ ఆమె నేనడిగిన దానికి ఒప్పుకోలేదు. నేను ఆమెకి చేసిన సహాయానికి ప్రతిఫలంగా ఆ రెస్టారెంట్లో కూర్చునే నా సమస్య తెలుసుకుని భోజనం పూర్తయ్యేలోగా దానికి సరైన పరిష్కారాన్ని ఆలోచించి చెప్పింది.

ఆమె చెప్పింది విన్నాక నా ఆనందానికి అవధులు లేవు. ఆమె సమక్షంలో నేను సమస్యని తాత్కాలికంగా మర్చిపోదామనుకుంటే ఆమె దానిని శాశ్వతంగా పరిష్కరించింది. నాకు ఆమె మీదున్న ఆకర్షణ మరింత పెరిగింది. ఆ క్షణంలోనే ఆమెని నా పెర్సనల్ సెక్రటరీగా అపాయింట్ చేసుకున్నాను. ఆమెమీద నాకున్న ఆకర్షణ అనురాగంగా మారడానికి ఎక్కువ రోజులు పట్టలేదు. దీని నిబట్టి మీరేమంటారు?''

''మీరు చాలా అదృష్టవంతులంటాను'' అన్నాడు చైతన్య నవ్వుతూ విస్కీ గ్లాసు పెదాలకి ఆనించుకుంటూ.

''నేను అదృష్టాన్ని నమ్మను. ఆమె వేరే వ్యక్తిని ప్రేమిస్తోందన్న సంగతి నాకు క్రమంగా తెలిసింది. మా మధ్యనున్న ఆర్థికపరమైన సంబంధం ఆమెకీ నాకూ మధ్య స్నేహాన్నీ బలోపేతం చేసిందే తప్ప ప్రేమని పెంచలేకపోయింది. ఇంత అందం, ఆస్తీ వున్న నన్ను వదిలేసి ఆమె ఇప్పటికీ ఆకలితో నడిరోడ్డు మీద తనని వదిలేసిన ప్రియుడినే ప్రేమిస్తోంది. నేను అప్పటి దాకా నమ్మిన మెటీరియలిస్టిక్ సిద్ధాంతం నన్ను వెక్కిరించింది'' అన్నాను.

''ఇంటరెస్టింగ్'' ఆసక్తిగా అన్నాడు చైతన్య.

''అలాంటి మనుషులు కూడా వుంటారా అని నాకు ఆశ్చర్యంగా వుంది. ఇప్పుడేం చేస్తారు మీరు? ఆమె అభిప్రాయాన్ని గౌరవించి ఆమెని మర్చిపోతారా?'' అని అడిగాడు.

నేను నవ్వేను. ''ఇంతసేపూ నేను మిమ్మల్ని మెటీరియలిస్టని వెక్కిరిస్తున్నాను. కానీ సొంత విషయాల్లోకి వచ్చేసరికి నా అంత చెడ్డవాడూ ఇంకెవరూ వుండరు. నాకు నా అనుకున్నదానిని అందుకోవడమే తెలుసు ఎంత కష్టపడైనా సరే... ఆమె ప్రియుడు బ్రతికుండగా ఆమె నాకు దగ్గర కాదని తెలుసు. అందుకే అతడిని చంపైనా సరే ఆమెని నేను దక్కించుకోవాలనుకుంటాను... కానీ... కానీ.. ఏదో శక్తి నన్ను ఆపుతోంది'' అన్నాను. నిజంగానే నన్ను ఆపుతున్న ఆ శక్తేమిటో నాకు తెలియంలేదు. నా జీవితంలో ఏ బిజినెస్ డీల్‌ని పూర్తి చేయడానికీ ఇంత ఎక్కువ సమయం తీసుకోలేదు.

చైతన్య కూడా నవ్వేడు. నన్ను ఆరాధనగా చూస్తూ అన్నాడు. ''మీరు మీరనుకుంటున్నంత దుర్మార్గులు కారు మిస్టర్ రవీంద్రా... మిమ్మల్ని ఆపే ఆ శక్తి మీలోనే వుంది. మీతో మాట్లాడుతుంటే అది నాకు తెలుస్తోంది. ఆ మాటకొస్తే మనందరిలోనూ ఆ శక్తివుంటుంది. కాకపోతే అది చేసే హెచ్చరికలనీ సలహాలనీ మనం పట్టించుకోము అంతే.. మీతో మాట్లాడుతుంటే నేనెంత తప్పుచేసానో నాకు తెలుస్తోంది. నేను శ్రావణిని సరిగ్గా అర్థం చేసుకోలేదనిపిస్తోంది. నాకామెని మళ్ళీ కలిసి క్షమార్పణలు కోరాలనిపిస్తోంది. మెచ్యూరిటీ అన్నది ఒకస్థాయి కాదన్న మీ మాటలు అక్షరాలా నిజం'' ఆ మాటలంటున్నప్పుడు అతని ముఖంలో మార్పు స్పష్టంగా కనిపించింది నాకు.

విస్మయంగా చూసాను. అంత పెద్ద రచయితని నా మాటలు ప్రభావితం చేస్తున్నాయన్న విషయం నాకు ఏదో తెలియని ఆనందాన్నిస్తోంది. ఆ క్షణంలో కలిగిన ఆనందాన్ని వర్ణించడానికి మాటలు సరిపోవు! నేను స్వయంగా స్థాపించిన సాఫ్ట్‌వేర్ కంపెనీ భారతదేశంలోనే నెంబర్ వన్ కంపెనీగా ఎదిగిన రోజున కూడా నేనంత ఆనందాన్ని అనుభవించలేదు.

''మనుషులని నమ్మడం అంటే వాళ్ళనుంచి మనమేదో ఆశిస్తున్నామన్నమాటే.. అలాకాకుండా మనుషులని ప్రేమించడం మొదలుపెడితే ఆశించడం వుండదు. ఇవ్వడమే వుంటుంది. అప్పుడు మీరున్న మానవ సంబంధాలు మరింత బలపడుతాయి..'' చైతన్య నోటినుంచి అప్పటిదాకా నేను వినని భావాలు వెల్లువలా పొంగుతూ మాటలరూపంలో బయటికి రాసాగాయి. అంతకుముందు అతడన్న ఆ శక్తేమిటో నాకిప్పుడు స్పష్టంగా తెలుస్తున్నట్లనిపిస్తోంది.

నేను చప్పున లేచి ''నేను బయలుదేరుతాను'' అన్నాను.

''మీ కారు పాడైపోయిందన్నారు?'' నా వంక ఆశ్చర్యంగా చూస్తూ అన్నాడు చైతన్య.

''చాలాసేపటి నుంచీ ప్రయాణం చేయడం వల్ల ఇంజను వేడెక్కి వుంటుంది. అంతే. మళ్ళీ ప్రయత్నించి చూస్తే స్టార్టవుతుందేమో'' అంటూ అతడి సమాధానం కోసం చూడకుండా గబగబా బయటికి నడిచాను. అతనికి వీడ్కోలు చెప్పి చీకట్లో కలిసిపోయాను.

★ ★ ★

మళ్ళీ వర్షం ప్రారంభమైంది. వర్షంలోనే డ్రైవ్ చేస్తూ వెళ్తున్నాను. కారుకి అడ్డుగా ఎవరో మనిషి తడుస్తూ వచ్చి చెయ్యి ఊపాడు ఆపమన్నట్లుగా.

సడెన్‌బ్రేక్ వేసి కారాపిన నేను అడ్డుగా నిలబడ్డ వ్యక్తిని చూసి ఆశ్చర్యపోయాను... అతను చైతన్య!

''మీరు మా ఇంట్లో దీనిని మర్చిపోయారు. మీకిద్దామని అడ్డదారిలో పరిగెడుతూ వచ్చాను'' అన్నాడు చైతన్య తను తీసుకు వచ్చిన వస్తువుని నా చేతిలో పెడుతూ.

కారు లైటు వెలుగులో నల్లగా మెరుస్తున్న ఆ రివాల్వర్‌ని చూడగానే తెల్లగా పాలిపోయింది నా ముఖం.

''నా ప్రేయసి ఎవరో కాదు..'' అంటూ గొంతు పెగుల్చుకుని ఏదో చెప్పబోయాను.

నా మాటలు పూర్తిగా వినకుండానే నన్ను వారిస్తూ అన్నాడు చైతన్య నవ్వుతూ. ''నేను ఊహించగలను. ఆమెకోసం మీరిప్పుడు నన్ను చంపేసినా నాకు సంతోషమే. కానీ మీరు కోరుకున్నట్లుగా మానవ సంబంధాల మీద ఒక మంచి నవలయినా రాయకుండా చనిపోయానే అన్న బాధ మాత్రం మిగిలిపోతుంది''

భయంకరంగా వీచిన తుపాను గాలి కూడా ఆహ్లాదకరంగా వున్నట్లనిపించింది ఆ క్షణంలో మా ఇద్దరికీ.

☆

